క్లుప్తంగా

వృద్ధులకు వైద్యశిబిరం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యులు

పెద్దశంకరంపేట(మెదక్): ఆయుష్ ఆధ్వర్యంలో వృద్ధులకు బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. యునానీ డిస్పెన్సరీ ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయుష్ వైద్యురాలు రజని, యునానీ వైద్యురాలు కమీరున్నీసాలు వృద్ధులకు మధుమేహం, రక్తపోటు, కంటి, వినికిడి, జీర్ణశయ, శ్వాసకోస సమస్యలు, మూత్ర సంబంధిత పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టులు ప్రియాకుమారి, సుస్మిత, సిబ్బంది జాఫర్, దశరథ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

నర్సాపూర్: ఎస్సీల వర్గీకరణను ఉపసంహరించుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శాంతికుమార్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ఎస్సీల మధ్య చిచ్చు పెట్టిందని ఆరోపించారు. ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా తమ మాల మహానాడు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. సుప్రీం ఉత్తర్వులతో మాలలకు అన్యాయం జరుగుతుందని, సుప్రీం కోర్టు పునరాలోచించాలని కోరారు. ఆయన వెంట మాల మహానాడు మండలాధ్యక్షుడు యాదగిరి తదితరులు ఉన్నారు.

చదువుపై ఇష్టం లేక..

నర్సాపూర్ రూరల్: చదువుపై ఇష్టం లేక బుధవారం ఓ విద్యార్థి పారిపోయేందుకు ప్రయత్నించాడు. మండలంలోని మహమ్మదాబాద్ గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలకు చెందిన కార్తీక్ 9వ తరగతి చదువుతున్నాడు. చదువుపై ఇష్టం లేక పారిపోయేందుకు ప్రయత్నించి నర్సాపూర్‌లో దొరికిపోయాడు. మహ్మదాబాద్ ఆశ్రమ పాఠశాల నుంచి తప్పించుకొని వచ్చి నర్సాపూర్ పట్టణంలోని ఆర్టీసీ పెట్రోల్ బంక్ వద్ద ఏడుస్తూ కనిపించాడు. స్థానికులు అతన్ని పోలీసులకు అప్పగించారు. విద్యార్థిని పోలీసులు ప్రశ్నించగా.. నాకు చదువుకోవడం, హాస్టల్లో ఉండడం ఇష్టం లేక ఇంటికి పారిపోయేందుకు నర్సాపూర్‌కి వచ్చినట్లు చెప్పాడు. దీంతో పోలీసులు అతన్ని గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాల సిబ్బందికి అప్పగించారు.

పనులు ప్రారంభం



విధుల్లో నిమగ్నమైన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ ఎంపీడీఓ కార్యాలయంలో మూడు రోజులుగా కరెంట్ లేక పనులు స్తంభించిపోయాయి. ఈ అంశంపై 'సాక్షి' దినపత్రికలో కరెంట్ లేక నిలిచిన సేవలు అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఎట్టకేలకు బుధవారం మధ్యాహ్నం వరకు కరెంట్ సరఫరా చేయగా.. కార్యాలయ పనులు పునఃప్రారంభమయ్యాయి.

మొక్కలు నాటి సంరక్షించాలి

– ఎంపీడీఓ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): అన్ని గ్రామాల్లో లక్ష్యం మేరకు వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్ అన్నారు. బుధవారం ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామానికి నాలుగువేల మొక్కలు లక్ష్యంగా వనమహోత్సవంలో నాటాలని చెప్పారు. వర్షాలు కురుస్తున్నందున నిర్లక్ష్యం చేయకుండా లక్ష్యం పూర్తి చేయాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని తెలిపారు. గ్రామంలో పాంపండ్, పశువుల షెడ్ నిర్మాణంపై అవగాహన కల్పించాలన్నారు.

నేడు రామాయంపేట బంద్

రామాయంపేట(మెదక్): బంగ్లాదేశ్‌లో హిందువుల ఊచకోతకు నిరసనగా గురువారం మున్సిపాలిటీ పరిధిలో బంద్ పాటించనున్నట్లు హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. బంద్‌కు వ్యాపార, విద్యా సంస్థలు, అందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కంపు కొడుతున్న కాలనీలు

నిలిచిన చెత్త సేకరణ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేయకపోవడంతో ఎటువైపు చూసినా.. కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం శివ్వంపేటలో 15 రోజుల నుంచి ఇళ్ల నుంచి పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ చేపట్టడడం లేదు. దీంతో చెత్తను గ్రామస్తులు ఎక్కడ పడితే అక్కడ వేస్తుండడంతో పారిశుద్ధ్యం లోపించింది. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించేందుకు పంచాయతీ ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చెత్తను డంపు చేసేందుకు స్థలం లేకపోవడంతో సమస్య నెలకొంది. గ్రామంలో డంప్‌యార్డు నిర్మించినప్పటికీ చిన్నగా ఉండడంతో పాటు ఐకేపీ కార్యాలయానికి దగ్గరగా ఉండడంతో ఉపయోగించడంలేదు. ఇన్నాళ్లు గ్రామ శివారులో పాడుపడిన బావుల్లో చెత్తను వేశారు. ప్రస్తుతం అవి నిండిపోవడంతో చెత్తను వేసేందుకు స్థలం లేదు.



నిరుపయోగంగా డంపుయార్డు

వివాద స్థలం కేటాయింపు

చెత్తను వేసేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని పంచాయతీ కార్యదర్శి రమాదేవి 20 రోజుల క్రితం రెవెన్యూ సిబ్బందిని కోరారు. అందుకు వారు గ్రామ సమీపంలోని 222 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి కేటాయించారు. అందులో పంచాయతీ సిబ్బంది జేసీబీతో గుంత తవ్వకం పనులు చేపట్టగా.. సదరు భూమి సాగుకోసం తమకు కేటాయించారని పలువురు అడ్డుకున్నారు. రైతులు అడ్డుకున్న విషయం రెవెన్యూ సిబ్బందికి చెప్పినా.. పట్టించుకోలేదు. ప్రస్తుతం సేకరించిన చెత్తను సైతం వేసేందుకు గ్రామ పరిసరాల్లో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మార్కెట్ వద్ద పేరుకుపోయిన చెత్త

దోమలతో అవస్థలు



చెత్త సేకరణ నిలిచిపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు స్వైర విహారం చేయడంతో రోగాల బారిన పడుతున్నాం.

– దొడ్ల నిర్మల, గృహిణి

ఇబ్బందులు పడుతున్నాం



వ్యాపార సముదాయాల వద్ద నుంచి చెత్తను తీసుకెళ్లకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. చెత్త సేకరణను నిలిపివేయడంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– శేరిపల్లి లలిత, వ్యాపారి

చర్యలు తీసుకుంటాం



శివ్వంపేటలో చెత్తసేకరణ కోసం చర్యలు తీసుకుంటాం. డంపుయార్డు కోసం స్థలం కేటాయించిన విషయంపై చర్చించి ప్రతీరోజు చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– కమలాద్రి, ప్రత్యేక అధికారి, తహసీల్దార్

పంచాయతీల్లో వార్డులను విభజించాలి

ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ పంచాయతీలలో ఓటరు జాబితా ఆధారంగా వార్డులను విభజించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుత ఓటరు జాబితా ఆధారంగా వార్డులను విభజించాలన్నారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా ఆరు నుంచి 12 వార్డుల వరకు విభజించే అవకాశం ఉంటుందన్నారు. అన్ని గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మురికి కాల్వలు శుభ్రం చేయాలన్నారు. నీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. సమావేశం అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ బలరాం, జూనియర్ అసిస్టెంట్ గులాంసలోనితో పాటు పంచాయతీ కార్యదర్శులకు మహిళా పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, రేణుక, సౌజన్య, సుజాత రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీడీఓకు రాఖీలు కడుతున్న మహిళా పంచాయతీ కార్యదర్శులు

రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



నిజాంపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



చిలప్‌చెడ్‌లో ఏఓ రాజశేఖర్‌కు దరఖాస్తులు ఇస్తున్న చండూర్ రైతులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.2 లక్షలలోపు రుణాలు ఉండి మాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విస్తరణాధికారి శ్రీలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రుణమాఫీ దరఖాస్తులు తీసుకునేందుకు రైతు వేదికలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ అన్నారు. ఆయన రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదు దరఖాస్తులు స్వీకరించారు. ఏఈఓలు భూపాల్, రమ్య పాల్గొన్నారు.

రేగోడ్(మెదక్): రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయశాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో రుణాలు మాఫీ చేయాలని రైతులు వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. రేగోడ్‌లో రెండు రోజుల నుంచి 38 మంది రైతులు తమ రుణాలను మాఫీ చేయాలని ఏఓ జావీద్‌కు దరఖాస్తులు చేశారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం రైతులతో బుధవారం కిటకిటలాడింది. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తులు అందజేశారు.

పీఏసీఎస్ చైర్మన్, సీఈఓపై విచారణ



టేక్మాల్‌లో విచారణ చేస్తున్న ఆర్డీఓ రమాదేవి, డీసీఓ కరుణ

టేక్మాల్(మెదక్): టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, సీఈఓ వేణుగోపాల్ సహకార సంఘంలో అవినీతి చేస్తూ నిధులు కాజేస్తున్నారని ఇటీవల డైరెక్టర్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం టేక్మాల్‌లో ఆర్డీఓ రమాదేవి, డీసీఓ కరుణ విచారణ చేపట్టారు. సహకార సంఘానికి వచ్చే నిధులన్నీ ఇష్టారాజ్యంగా ఎవరిపేర్లమీద కంటే వారికి ట్రాన్స్‌ఫర్ చేశారని డైరెక్టర్లు పలు ఆధారాలతో ఆర్డీఓకు సమర్పించారు. ఎటువంటి తీర్మానాలు లేకుండా చైర్మన్, సీఈఓ ఖాతాల్లోకి లక్షల కొలది డబ్బులు ఎలా మార్చుకుంటున్నారని డైరెక్టర్లు ప్రశ్నించారు. ప్రతీ దానికి ఎంబీ ఉందని, రికార్డు ప్రకారమే అభివృద్ధి పనులకు మాత్రమే డబ్బులు డ్రా చేసినట్లు చైర్మన్ బదులిచ్చారు. రికార్డులు చూపాలని సీఈఓను ఆదేశించగా.. రికార్డులు ఇంట్లో ఉన్నాయని బదులివ్వడంతో రికార్డులు ఇంట్లో పెడతారా అంటూ ఈ విషయమై మెమో జారీ చేస్తానని డీసీఓ తెలిపారు. సీఈఓ వేణుగోపాల్ పలు రికార్డులను సమర్పించగా.. పూర్తిగా లేవని తెలపడంతో రెండు రోజులు అవకాశమివ్వాలని పూర్తిస్థాయి రికార్డులు అందజేస్తామని చైర్మన్, సీఈఓ అన్నారు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు, ఒరిజనల్ రిసిప్టులు తీసుకొని రావాలని మరో రెండురోజుల వరకు విచారణ వాయిదా వేస్తున్నట్లు ఆర్డీఓ చెప్పారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శంకర్



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ లింగం



రామాయంపేటలో మాట్లాడుతున్న ఎస్‌ఐ బాల్‌రెడ్డి



పాపన్నపేట(మెదక్): ఉన్నత పాఠశాలలో..

ఎస్‌ఐ లింగం

నర్సాపూర్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ లింగం విద్యార్థులకు సూచించారు. బుధవారం పట్టణంలోని పిల్లల పార్కులో, పట్టణంలోని పలు ప్రభుత్వ బాలుర వసతి గృహాలకు చెందిన విద్యార్థులకు డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ ఫ్రీ మెదక్ జిల్లా మనందరి లక్ష్యమని, అందుకు అందరూ తమతో సహకరించాలని కోరారు. డ్రగ్స్, మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి, తల్లిదండ్రులను బాధ పెట్టొద్దన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

మాదక ద్రవ్యాలతో ప్రమాదం

రామాయంపేట(మెదక్): మత్తులో జీవితాలు చిత్తవుతాయని ఎస్‌ఐ బాల్‌రెడ్డి పేర్కొన్నారు. వివేకానంద స్కూలులో విద్యార్థులకు మత్తు పదార్థాల వివియోగంపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలను ఎవరైనా వినియోగిస్తే తమకు సమాచారం అందజేయాలని సూచించారు. ఏఎస్‌ఐ మల్లికార్జున్, హెచ్‌ఎం రాంకుమార్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

విక్రయిస్తే కఠిన చర్యలు

రేగోడ్(మెదక్): మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పోచయ్య హెచ్చరించారు. మండల కేంద్రం రేగోడ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్‌ను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. ఎవరికైనా శిక్ష తప్పదన్నారు.

బానిసలు కావొద్దు

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని పోలీసులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు.

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాలపై విద్యార్థులకు ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, సెల్‌ఫోన్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశం, అంజాగౌడ్, యాదయ్య, మోహన్‌రావు, నర్సింలు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. పెద్దశంకరంపేటలో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ ప్రభుత్వాల కుట్రే..

మెదక్ మున్సిపాలిటీ: ఎస్సీ వర్గీకరణ అనేది దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కుట్ర అని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ ఆరోపించారు. జాతీయ మాల మహానాడు పిలుపులో భాగంగా బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్సుడిపో ఎదుట ధర్నా చేసి, నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెంటయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, ఆనంద్, మెదక్ పట్టణాధ్యక్షుడు ప్రసాద్, బీఎస్పీ నాయకులు సిద్ధిరాములు, వెల్దుర్తి మండలాధ్యక్షులు కుమార్, జాతీయ మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.



మెదక్‌లో ఆర్టీసీ బస్సు డిపో ఎదుట ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ హంతకులను కఠినంగా శిక్షించాలి

నర్సాపూర్: కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హోళియా దాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరిగిన దుర్ఘటనను తీవ్రంగా ఖండించారు. ఆ ఘటనలో నిందితులకు శిక్ష త్వరగా ఖరారు చేసేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.

◆ ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): శాసన మండలి సభ్యుడిగా నియామకమైన ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌ను మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని కోదండరామ్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజశేఖరరెడ్డి, శివరాథోడ్, నవీన్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్ కలిసి అభినందించారు. మెదక్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

◆ మండల వ్యవసాయ అధికారిగా బాల్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్ మండల వ్యవసాయ అధికారిగా బాల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. చిలప్‌చెడ్ ఏఓగా పనిచేసిన బాల్‌రెడ్డి బదిలీపై హవేళిఘణాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

◆ సన్మానం

వెల్దుర్తి(తూప్రాన్): ఉత్తమ తహసీల్దార్‌గా తూప్రాన్ డివిజన్‌పరిధిలో కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్న మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతిని బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు, యువకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు యాదగిరి, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, రేపల్లె సంతోష్, దుంపల బాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు నరేశ్, శరత్, శ్రీకాంత్, శివ, పవన్, వినోద్ పాల్గొన్నారు.

మెదక్ కలెక్టరేట్: మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బదిలీ అయిన అధ్యాపకులు, సిబ్బందిని బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

◆ మహిళలకు రక్షణ కల్పించాలి

మెదక్ కలెక్టరేట్: దేశంలో మహిళలకు అనేక విధాలుగా రక్షణ లేకుండా పోతుందని ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... మన దేశంలో ఆడపిల్లలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు.

◆ ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పంపొద్దు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట ఇతర పాఠశాలలకు పంపించొద్దని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ రాధాకిషన్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు.

◆ చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): నెల రోజుల క్రితం కుక్క దాడిలో గాయపడిన ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మ్యాకల శ్రీనివాస్ (42) రోజు మాదిరిగానే పొలం పనులకు వెళ్లాడు. అక్కడే ఓ కుక్క అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వారం నుంచి పరిస్థితి విషమించడంతో, సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతిడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు.

◆ అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా

చేగుంట(తూప్రాన్): అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తాపడిన సంఘటన చేగుంట శివారులోని మక్కరాజీపేట రోడ్డులో బోనాల చౌరస్తా వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. బోనాల గ్రామం నుంచి సన్నరకం ధాన్యం లోడుతో కోదాడకు వెళ్తున్న లారీ చేగుంట బోనాల్ చౌరస్తా వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది.

◆ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కొల్చారం(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న పిలుపుమేరకు మండలంలోని సంగాయిపేటలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు ఆగంగౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదులు ఇవ్వాలి

నర్సాపూర్: రుణమాఫీ పథకం కింద రుణాలు మాఫీకి నోచుకొని రైతులు తమ ఫిర్యాదులను రైతు వేదికలోని గ్రీవెన్స్‌సెల్‌లో అందజేయాలని మండల వ్యవసాయాధికారి దీపిక కోరారు. ప్రభుత్వం మూడు విడుతలుగా రుణమాఫీ పథకం అమలు చేసిందని చెప్పారు. ఆయా కారణాలతో రుణమాఫీ కాని రైతులు తమ వివరాలతో వినతిపత్రాలు అందజేయాలని సూచించారు.

◆ మాటకు కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం శివ్వంపేటలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా నివాసంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతుందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ తప్పక వర్తింస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, అరుణ్, కృష్ణ, ఆంజనేయులు, మహేశ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

◆ బోరుబావిలో మోటార్ ఏర్పాటు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ప్రాథమిక పాఠశాల దగ్గర ఉన్న బోరుబావిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా మోటార్ ఏర్పాటు చేశారు. సొంత నిధులతో ఏర్పాటు చేసిన మోటార్‌ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేశ్, ప్రభులింగంగౌడ్, ఆనందరావు, సత్తయ్య, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, షబ్బీర్, తదితరులు ఉన్నారు.

విద్యా ప్రమాణాలను పెంచాలి : నీలకంఠం



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కొల్చారం(నర్సాపూర్): ఉపాధ్యాయులు సమర్థవంతమైన బోధన ద్వారా విద్యా ప్రమాణాలను పెంచాలని ఎంఈఓ నీలకంఠం సూచించారు. బుధవారం మండలంలోని రంగంపేట, చిన్న ఘనాపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈనెల నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాన్ని తప్పక నిర్వహించడంతో పాటు విద్యార్థులు పాఠశాలకు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశం, విశ్వరూప, గణేశ్, హిమబిందు తదితరులు ఉన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలి : రాజు డిమాండ్

చిన్నశంకరంపేట(మెదక్): పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ అమలు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు రాజు డిమాండ్‌చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు జరగకపోతే తప్పకుండా పెద్ద మొత్తంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శి దశరథ్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మూర్తిశంకర్, మండల ఉపాధ్యక్షుడు శీను, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రమేశ్, పట్టణాధ్యక్షుడు రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అక్రమంగా విద్యుత్ వినియోగించిన వ్యక్తికి జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

తూప్రాన్: వీధిలైట్ల నుంచి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న వ్యక్తికి రూ.8వేల జరిమానా విధించినట్లు మున్సిపల్ మేనేజర్ రఘువరన్ బుధవారం పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ రోడ్డు పక్కన నాటుకోళ్ల పౌల్ట్రీఫాంను కండెల దుర్గయ్య అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. కొన్నాళ్లుగా అక్రమంగా వీధిలైట్ నుంచి విద్యుత్‌ను వినియోగిస్తున్నాడు. పలుమార్లు హెచ్చరించినా.. మానుకోలేదు. దీంతో బుధవారం సదరు వ్యక్తికి రూ.8వేల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.